

మిషన్ భగీరథలో..
మిషన్ భగీరథ నల్లాల సర్వేతో పథకం అమలులో డొల్లతనం బయటపడుతోంది. నల్లా కనెక్షన్ల లెక్కల్లో పొంతన కుదరడం లేదు.
- 8లో ▸



మండలాల్లో ప్రజావాణి..
మండలాల్లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైంది. అధికారులు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /22.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోండి’

కామారెడ్డి అర్బన్: డైట్ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు పొందిన వారు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 45 శాతం మార్కులున్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 63095 35759, 99665 09891 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గృహజ్యోతి కోసం మండల పరిషత్‌లో..

కామారెడ్డి అర్బన్: ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చినా గృహజ్యోతి కింద జీరో బిల్లు రాని అర్హులైనవారు మండల పరిషత్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు సూచించారు. గృహజ్యోతి అమలు కాకపోతే సరిచేయడానికి తమకు అధికారం లేదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 37.3 శాతం ఉత్తీర్ణత

కామారెడ్డి టౌన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్మీడియట్ బోర్డు సోమవారం ప్రకటించింది. జిల్లాలో 37.3 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏప్రిల్ 24వ తేదీన విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జిల్లా 35వ స్థానంతో అట్టడుగున నిలిచిన విషయం తెలిసిందే. సోమవారం ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాకు 27వ స్థానం దక్కింది. ఇంటర్ ఫస్టియర్‌లో 5,550 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,463 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 44.38గా నమోదైంది. బాలికలు 1,388 మంది(51.5 శాతం), బాలురు 1,075 మంది (37.65 శాతం) పాసయ్యారు. వొకేషనల్‌లో 704 మంది విద్యార్థులకుగాను 361 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్ సెకండియర్‌లో 3,871 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,444 మంది పాస్ అయ్యారు. ఉత్తీర్ణత 37.3 శాతంగా నమోదయ్యింది. బాలికలు 710 మంది (45.06శాతం), బాలురు 728 మంది (31.98 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్‌లో 416 మందికిగాను 207 మంది విద్యార్థులు పాసయ్యారు.

నేడు ముగియనున్న పాలిసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: పాలిసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ సోమవారం కొనసాగింది. ఇందులో 415 మంది విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టినట్లు కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరాంకుమార్ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారంతో ముగుస్తుందని పేర్కొన్నారు. అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌పై దాడి

నిజామాబాద్‌నాగారం: కరెంట్ బిల్లు కట్టమన్న లైన్‌మన్‌పై ఓ వ్యక్తి అనుచరులతో కలిసి దాడి చేశాడు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. దుబ్బ సెక్షన్‌లో విధులు నిర్వహించే ఓ లైన్‌మన్ సెక్షన్ పరిధిలోని ఓ వ్యక్తిని పెండింగ్ బిల్లు కట్టమని కోరాడు. దీంతో ఆయన బిల్లు కట్టకపోగా లైన్‌మన్‌తో గొడవ పడ్డాడు. అనంతరం తన మిత్రుడు కార్పొరేటర్‌ను పిలిపించుకొని, అనుచరులతో నగరంలోని దుబ్బ సెక్షన్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ కార్పొరేటర్, అతడి అనుచరులు లైన్‌మన్‌పై దాడి చేశారు. అక్కడే సబ్‌ఇంజనీర్, ఇతర ఉద్యోగులు ఉన్న భయంతో మౌనంగా ఉండిపోయారు. ఈ విషయాన్ని బాధిత లైన్‌మన్ తోటి ఉద్యోగులకు చెప్పినా అందరు మౌనంగా ఉండిపోయారు. ఒక వేళ ఫిర్యాదు చేస్తే మళ్లీ దాడి చేస్తారని భయంతో ఎవరికి ఫిర్యాదు చేయలేదు. కాగా ఈ ఘటనపై యూనియన్ నాయకులు, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో 2025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 202 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1058.30 అడుగుల(9.05టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.



నీరులేక వెలవెలబోతున్న పోతారం ఊర చెరువు

సాగేదెలా?

నైరుతి రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి. దట్టంగా కమ్ముకొస్తున్న మేఘాలు.. వర్షించకుండానే తేలిపోతూ అన్నదాతల ఆశలతో ఆడుకుంటున్నాయి. వానాకాలం సీజన్‌లో ఒక్క భారీ వర్షం కూడా పడకపోవడంతో పంటల సాగు పనులు ముందుకు పడడం లేదు. కొన్నిచోట్ల ఇప్పటికీ నారుమడులు కూడా సిద్ధం చేసుకోలేదు. మరోవైపు కాలం కరిగిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- ఆరుద్ర వచ్చినా కరుణించని వరుణుడు
- నేల తడవకపోవడంతో విత్తనం వేయడానికి రైతుల వెనుకంజ
- కాలం కరిగిపోతుండడంతో ఆందోళన

సాక్షి, కామారెడ్డి : వానాకాలం ప్రారంభమైనా వానల జాడ లేదు. మృగశిర కార్తె ముగిసి, ఆరుద్ర కార్తె వచ్చినా ఒక్క భారీ వర్షం కూడా కురవలేదు. దీంతో వర్షాలపై ఆధారపడి మెట్ట పంటలు సాగు చేసే రైతులు విత్తనం వేయాలంటే జంకుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురియడంతో విత్తనం వేసి ఆకాశంవైపు చూస్తున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో దుక్కులు దున్ని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు వరి నారుమడులు పోశారు. పోచారంలో నీటి నిల్వ డెడ్‌స్టోరేజీకి చేరడంతో ఇప్పటికీ రైతులు పనులు మొదలుపెట్టలేదు. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో వాటి ఆయకట్టు కింద నారుమడులు పోసే ధైర్యం చేయలేకపోతున్నారు. వేసవి సీజన్‌లో చాలా బోర్లు ఎత్తిపోయిన నేపథ్యంలో నారుమడులకు కూడా నీరందించే పరిస్థితి లేకపోవడంతో వర్షాలు కురిసి, బోర్లు కుదురుకున్న తర్వాతే నారుపోయాలని భావిస్తున్నారు. భారీ వర్షాలు కురిసి వాగులు వంకలు పొంగి ప్రవహిస్తే తప్ప బోర్లలో నీటి ఊటలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.



పోతారం ఊరచెరువు ఆయకట్టు కింద బీడుగా ఉన్న భూమి

సాధారణం కన్నా తక్కువే..

మృగశిర కార్తెలో భారీ వర్షాలు కురుస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. ఆరుద్ర కార్తె ప్రవేశించి మూడు రోజులు గడచినా పరిస్థితిలో మార్పు లేదు. దీంతో జిల్లాలో ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణంకన్నా తక్కువ నమోదైంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురవగా, ఒకటి రెండు మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. సోమవారం వరకు 106.3 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 89 మి.మీ. వర్షమే కురిసింది. దోమకొండలో 61 శాతం తక్కువ వర్ష పాతం నమోదైంది. కామారెడ్డిలో 53.7 శాతం, నిజాంసాగర్ 54.8 శాతం, బీబీపేటలో 47.3 శాతం, బాన్సువాడ 46.7 శాతం, పాల్వంచలో 35.2 శాతం, మాచారెడ్డిలో 25.5 శాతం, నాగిరెడ్డిపేట 31.5 శాతం, ఎల్లారెడ్డి 31.7 శాతం తక్కువ వర్షం కురిసింది.

పనులు సాగుతలేవు

వానలు పడక ఎవుసం పనులు ముందుకు పడుతలేవు. నీళ్ల లేక ఇంకా నారే పోయలే.. నాట్లు ఎప్పుడేసుడో ఏమో? కాలం గిట్లనే ఉంటే కష్టమైతది.

– గోపాల్‌నాయక్, రైతు, రాజమ్మతండా

బోర్లల్ల నీళ్లు లేవు..



వానాకాలం వచ్చినా ఇంకా ఎండలు బాగా కొడుతున్నయి. దీంతో బోర్లు ఎత్తిపోతున్నయి. కాలం కాకపోతే వ్యవసాయ పనులు ఎట్లనో ఏమో?

– ముచ్చ పెద్ద గంగయ్య, రైతు, ఇసన్నపల్లి

వానలు పడకపోతే కష్టమే



మృగశిర పోయి ఆరుద్ర వచ్చినా వానల జాడ లేదు. దీంతో భూగర్భ జలాలు పడిపోతున్నయి. వానలు పడితేనే వ్యవసాయ పనులు ముందుకు సాగుతయి.

– లక్ష్మారెడ్డి, రైతు, ఇసన్నపల్లి

పోచారంను ప్రజలు క్షమించరు

- పార్టీని, ప్రజలను మోసం చేశారు
- బాన్సువాడ నియోజకవర్గ కార్యకర్తలకు అండగా ఉంటాం
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, గంప, జాజాల, సింధే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు జాజాల, బాజిరెడ్డి, సింధే, గంప

సాక్షి, కామారెడ్డి: నమ్మిన పార్టీని, నమ్ముకున్న బాన్సువాడ ప్రజలను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మోసం చేశారని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే విమర్శించారు. సోమవారం కామారెడ్డిలోని గంప గోవర్ధన్ నివాసంలో నలుగురు మాజీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, పోచారం పార్టీ మారడం తదితర పరిణామాలపై చర్చించారు. అనంతరం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సీనియర్ నాయకుడిగా గుర్తించి 2014 లో వ్యవసాయ శాఖ మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని, 2018 లో శాసనసభ స్పీకర్ చేశారని గుర్తు చేశారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు ఇచ్చారని పేర్కొన్నారు. అలాంటి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేయడం ఎంతవరకు న్యాయమని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు పోచారంను, ఆయన కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, వారికి ఎలాంటి ఆపద వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా తామందరం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన పోచారం



కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో రేవంత్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీలను కలిశారు. పోచారం తనయులు భాస్కర్ రెడ్డి, సురేందర్‌రెడ్డిలను రేవంత్‌రెడ్డి పార్టీ అగ్రనేతలకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న తెయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం క్యాంపస్‌లోని ఓల్డ్ బాయ్స్, న్యూ బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్‌ను వార్డెన్లతో కలిసి తనిఖీ చేశారు. హాస్టల్స్ కేర్‌టేకర్స్, వంట మనుషులు, వర్కర్లు, మెస్ కమిటీ మెంబర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శుక్రవారం బాలికల హాస్టల్‌లో అల్పాహారంలో కీటకం వచ్చిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హాస్టల్స్ సిబ్బంది మెస్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు కిరణ్మయి, కిరణ్‌రాథోడ్, గంగాకిషన్, కేర్‌టేకర్లు జమున, డిగంబర్ చౌహాన్, క్రాంతికుమార్, గ్రోసరీ, వెజిటబుల్స్ సప్లయర్స్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల చెంతకు బాన్సువాడ పంచాయితీ





మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మలతో మాట్లాడుతున్న బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ: బాన్సువాడ రాజకీయపంచాయితీ హైదరాబాద్‌కు చేరింది. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆయన చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ నేతలు సోమవారం హైదరాబాద్ వెళ్లారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలను కలిసి తమ గోడు వినిపించారు. పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికే అప్పగించాలని కోరారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల పరిస్థితి గురించి వివరించామని పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్ తెలిపారు.

‘సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె చేస్తాం’

నిజామాబాద్‌నాగారం: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మెకు దిగారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సుమారు 300 మంది సమ్మెలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం విధులు బహిష్కరించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. అయితే అత్యవసర విభాగంలో పనిచేసే జూనియర్ డాక్టర్లకు మినహాయింపు ఇచ్చారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే సమ్మెకు దిగామని తెలిపారు. తమకు ప్రతినెలా స్టైఫండ్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.



నిజామాబాద్‌లో సమ్మెలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

డిమాండ్లను పరిష్కరించాలి

మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. గత ప్రభుత్వానికి సైతం పలుమార్లు మా సమస్యలను విన్నవించాం. ఇదిగో, అదిగో అంటు కాలం వెళ్లదీశారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– సురేష్ నీరుడి, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

స్టైఫండ్ ప్రతినెలా ఇవ్వాలి

జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ రాక నానా ఇబ్బందులు పడుతున్నాం. నెలల తరబడిగా ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. రోగులకు సేవలందిస్తున్న మాకు సకాలంలో స్టైఫండ్ ఇస్తే బాగుంటుంది. ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరిస్తే సమ్మె విరమిస్తాం.

– చంద్రకాంత్, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రజావాణికి వినతుల వెల్లువ

భారీగా తరలివచ్చిన ప్రజలు

- అప్పటికప్పుడే మండలాధికారులతో మాట్లాడిన కొత్త కలెక్టర్ సంగ్వాన్
- ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి అర్బన్ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈసారి వినతులు పోటెత్తాయి. ప్రజలు సమస్యలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఫిర్యాదుల పరిష్కారం కోసం చొరవ చూపారు. వెంటవెంటనే మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూసమస్యలను చెప్పుకోవడానికి ప్రజలు ఎక్కువగా రావడంతో కలెక్టర్ అప్పటికప్పుడు ధరణికి సంబంధించి వరండాలో కౌంటర్ ఏర్పాటు చేయించారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నవి ధరణి అన్‌లైన్‌లో పరిశీలించి తనకు రాసి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

103 ఫిర్యాదులు నమోదు

ప్రజావాణిలో 103 ఫిర్యాదులు నమోదయ్యాయి. షరా మామూలుగానే రెవెన్యూ సమస్యలపైనే అధిక ఫిర్యాదులు వచ్చాయి. ధరణి, భూసమస్యలపై 68, డీఆర్‌డీవోకు సంబంధించి 6, మున్సిపల్ 2, ఏడీ సర్వే 2, బీసీ సంక్షేమశాఖ 2, విద్యుత్ 10, వ్యవసాయ 2, విద్య 3, అటవీశాఖ 2, పౌర సరఫరాలు 3, ధాన్యం సేకరణ, వైద్య ఆరోగ్య, డీపీవోలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు నమోదయ్యాయి.

ఒకటో తేదీన వేతనాలివ్వాలి

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన విధంగానే తమకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. నెలలుగా అంగన్‌వాడీ భవనాల అద్దె, గ్యాస్, కూరగాయలు, ఈవెంట్స్ బిల్లులు రావడ లేదని తెలిపారు. ఏడాదిగా రిజిస్టర్లు, బీఎల్‌వో బిల్లులు పెండింగ్‌లు ఉన్నాయన్నారు. బిల్లులు వచ్చేలా చూడాలని కోరారు.

బిల్లులు చెల్లించాలి

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, కోడి గుడ్లు, మెనూ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ప్రతినెలా రూ. 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి ప్రతం అందించారు.

గ్రామ పంచాయతీలో పేర్లు తారుమారు చేసి 305 గజాల ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని, తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని బీబీపేటకు చెందిన మల్లం లక్ష్మి, నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారునిపై ఫిర్యాదు చేస్తే జిల్లా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కోరారు.



ధరణి సమస్యలపై ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న సిబ్బంది

గ్రూప్-4 ఉద్యోగం ఇప్పించండి



దివ్యాంగుడనైన తనకు గ్రూప్-4 ఉద్యోగం ఇప్పించాలని మాచారెడ్డి మండలం ఎల్లంపేటకు చెందిన భూక్యా పీర్యా కోరాడు. గ్రూప్-4లో తనకు 87 మార్కులు వచ్చాయని తెలిపాడు. కలెక్టర్ చాంబర్ వద్ద కాళ్లతో వినతి పత్రం రాయడం అందరిని ఆకర్షించింది. ప్రజావాణిలో వినతిపత్రం అందించాడు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచవద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 4,300 ప్రజావాణి ఫిర్యాదులు, సీఎం ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కారించాలని ఆయా మండలాల అధికారులు, ఆర్డీవోలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. పరిష్కారం కాని వాటిపై ప్రత్యామ్నాయాలు సూచించాలని పేర్కొన్నారు. పరిష్కారం అయ్యే ఫిర్యాదులు, వినతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. మిషన్ భగీరథ నల్లాల సర్వే చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో చందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 3 నెలల బిల్లులను తక్షణమే చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 10వేలు అమలు చేయాలని, స్లాబ్ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, గ్యాస్‌కు సబ్సిడీ ఇవ్వాలని తదిరత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు కిష్టాగౌడ్, వెంకట్రాజం తదితరులున్నారు.

వెలవెలబోతున్న చెరువులు

- గతేడాది జూన్‌లో జలకళ
- ఈ ఏడాది ముఖం చాటేసిన వర్షాలు



రామారెడ్డి : వేసవిలో మండుటెండలకు మార్చి నెల మొదట్లోనే చెరువులు ఎండిపోయాయి. ఆ తర్వాత ఏప్రిల్ మే నెలల్లో తీవ్రమైన ఎండలకు మండలంలోని చెరువులన్నీ చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. మే,జూన్ నెలలో అప్పుడప్పుడు పడ్డ చిన్నపాటి వర్షాలకు చెరువులోకి నీళ్లు రాలేదు. దీంతో వర్షాకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా మూగజీవాలకు కూడా తాగడానికి నీళ్లు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో మే జూన్ నెలలో పడ్డ చిన్నపాటి వర్షాలకు చెరువుల్లో గడ్డి మొలవడంతో పశువులకు గొర్లకు మేతగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజులు కష్టంగా మారతాయని రైతులు వాపోతున్నారు.

మండలాల్లో ప్రజావాణి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించినట్లు తహసీల్దార్ ప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, ఏపీఎం గంగాధర్, ఆరోగ్య శాఖ, విద్యా శాఖ 11 రకాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ తెలిపారు. ఎంపీవో తిరుపతిరెడ్డి, మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్, మండల పశువైద్యాధికారి శివ తదితరులు హాజరయ్యారు

భిక్కనూరు : మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రోజా, నీటిపారుదల శాఖ ఏఈ సోయల్, పశువైద్యాధికారి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని మూడు దరఖాస్తులు రాగా, పింఛన్ ఇప్పించాలని ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో నరేందర్, ఎంఈవో రామస్వామి తదితరులున్నారు.

మద్నూర్(జుక్కల్) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ముజీబ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో మండలంలోని ఆరుగురు రెవెన్యూకు సంబంధించిన ఫిర్యాదులు సమర్పించారన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దశరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎవరూ ఫిర్యాదులు చేయలేదు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ అధికారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ శాఖ ప్రజావాణి కార్యక్రమంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని విద్యుత్ శాఖ డీఈ గణేశ్ తెలిపారు. డివిజన్ కేంద్రంలో నాలుగు చోట్ల విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.



దోమకొండలో ప్రజావాణికి హజరైన వివిధశాఖల అధికారులు

గృహజ్యోతి సమస్యలపై ప్రజాపాలన కేంద్రాలు

గృహజ్యోతి మహాలక్ష్మి పథకాలపై సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ గణేశ్ తెలిపారు. గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమకి పథకం అమలు కాకపోతే ఈ కేంద్రాలలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఆఫీస్‌లో గ్రామీణ ఫిర్యాదులకు ప్రతి ఎండీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రంలోని తహశీల్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని తహశీల్దార్ తెలిపారు.

పిట్లం(జుక్కల్) : జిల్లా కలెక్టర్ సెంగ్వాన్ ఆదేశాల మేరకు పిట్లం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని 16 శాఖల అధికారులు హాజరయ్యారన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

సెల్‌ఫోన్‌తో కాలక్షేపం

కామారెడ్డి టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చాలామంది అధికారులు ఫోన్‌లలో నిమగ్నమయ్యారు. ప్రజలు అధిక సంఖ్యలో ఫిర్యాదులు సమర్పిస్తున్న తరుణమంలో కొందరు అధికారులు ఫోన్‌లతో కాలక్షేపం చేశారు. సోషల్‌మీడియాలో బిజీగా గడిపారు.



ఎల్లారెడ్డిలో ట్రాన్స్‌కో అధికారి డుమ్మా..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణిని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు లైట్‌గా తీసుకుంటున్నట్లు కనిపించింది. సోమవారం ఏడీ కార్యాలయంలో ప్రారంభమైన విద్యుత్ ప్రజావాణి ఏడీ సుదర్శన్‌రెడ్డి గైర్హాజరయ్యారు. విద్యుత్‌శాఖ సీఎండీ ఇచ్చిన ఆదేశాలను విద్యుత్ శాఖ అధికారులు బేఖాతరు చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఆఫీస్ పనిమీదే ఆయన బైయటకు వెళ్లారని అటెండర్ పేర్కొనగా మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూడా ఆయన ప్రజావాణికి రాలేదు.



ఏడీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీ కుర్చీ

డీఈవోకు సన్మానం

కామారెడ్డి టౌన్ : 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ అయి పదోన్నతులు పొందిన సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలోని భాషా పండితులు సోమవారం డీఈవో ఎస్ రాజు ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు నార్ల అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్ శిక్షక్, రాష్ట్ర కార్యదర్శి మంత్రి మధుసూదన్, ప్రతినిధులు లాల్ సింగ్, సురేష్ తదితరులున్నారు.



డీఈవోను సన్మానిస్తున్న భాషా పండితులు

తేలిన 'మిషన్ భగీరథ' డొల్లతనం

- ఇష్టారాజ్యంగా నల్లా కనెక్షన్ల రికార్డులు
- ఒకేఇంట్లో నాలుగు నల్లాలు ఉన్నట్లు ఎంట్రీలు
- ప్రస్తుత జీపీ సర్వేల్లో బట్టబయలు



నల్లాల సర్వే చేస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాల ద్వారా రక్షిత మంచినీటిని అందిస్తోంది. పథకం ద్వారా ప్రతి వీధిలో పైపులైన్ వేసి ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఇంటిలో నలుగురు వ్యక్తులకు ఒక నల్లా కనెక్షన్, ఒకొక్క వ్యక్తికి వంద లీటర్ల చొప్పున నీటిని అందించాలి. అయితే ఒకే ఇంటిలో నలుగురు కంటే ఎక్కువ మంది ఉంటే రెండు నల్లాలు కనెక్షన్లు ఇచ్చామని మిషన్ భగీరథ అధికారులు ఇష్టారాజ్యంగా నల్లాల నివేదికలు తయారు చేశారు. దీంతో ప్రజలకు ఎంత వరకు రక్షిత మంచినీరు అందుతుందో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో నల్లాల సర్వే చేయాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పది రోజుల్లో నల్లాల వద్ద యజమాని, సర్వే సిబ్బంది ఫొటోలు దిగి సర్వే యాప్‌లో నమోదు చేసి నల్లాల లెక్కలు తేల్చారు. మిషన్ భగీరథ, జీపీ సిబ్బంది ఇద్దరి గణాంకాల్లో చాలా వ్యత్యాసం కనిపించింది. రెండు శాఖల అధికారుల నల్లాల లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయి. జిల్లాలో 2,31,469 ఇళ్లలో మిషన్ భగీరథ శాఖ ఇచ్చింది. అలాగే కొత్తగా 70,329 జీపీ కనెక్షన్లు ఇచ్చారు. మొత్తం 3,01,798 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. అధికారుల సర్వేల్లో 1,92,4762 నల్లాలు ఉన్నట్లు వెల్లడించారు. కూలిపోయిన ఇళ్లు, చనిపోయిన ఇంటి యజమాని పేరు మీద ఉన్న కొన్ని నల్లాలు సర్వేలో నమోదు కాలేదు.

అడ్డగోలుగా..

ఒక్కో ఇంటిలో మూడు, నాలుగు నల్లాలు ఇచ్చినట్లు మిషన్ భగీరథ రికార్డులో ఉందని సర్వే అధికారులు ఇంటి యజమానికి వివరించడంతో వారు అవాక్కయ్యారు. ఇంటిలో ఒకటే కుళాయి ఉండాగా రికార్డుల్లో మూడు, నాలుగు కుళాయిలు నమోదు చేయడంపై మిషన్ భగీరథ అధికారులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇవేం రికార్డులు..

మా ఇంట్లో నలుగురు పెద్దలు ఇద్దరు చిన్నారులున్నారు. ఒకటే నల్లా కనెక్షన్ ఉంది. నాలుగు నల్లా కనెక్షన్లు రికార్డులో ఉందని సర్వే అధికారులు తెలపడంతో అవాక్కయ్యాను. ఉన్న ఒక్కనల్లా నుంచి కూడా సక్రమంగా నీళ్లు రావు. నల్లా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. మిషన్ భగీరథ అధికారులు రికార్డుల్లో అన్ని తప్పుడు లెక్కలు చూపించారు. – ఉదయ్ కుమార్, గుండెకల్లూర్ గ్రామం

తాగునీటి కోసం నిరసన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేటలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో తాగునీటి సమస్యపై సోమవారం కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కాలనీలోని ప్రధాన రోడ్డుపై ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారంరోజులుగా తాగునీరు రావడంలేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న జీపీ కార్యదర్శి కిష్టయ్య వెంటనే ట్యాంకర్ల ద్వారా కాలనీవాసులకు నీటిని సరఫరా చేయించారు. అనంతరం ఎంపీవో ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ వినోద్ కాలనీకి వెళ్లి తాగునీటి సమస్యను పరిశీలించారు. బోరులో మోటార్ పడిపోవడం వల్ల నీటిసమస్య వచ్చిందని, మూడురోజుల్లో బోరులో మరో మోటార్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా కాలనీవాసులకు నీటిని అందిస్తామని వారు చెప్పారు. నిరసనలో కాలనీవాసులు ఫరీద్, మశ్చేందర్‌గౌడ్, యాదగిరి, కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తాం



కామారెడ్డి క్రైం : నెంబర్ ప్లేట్ లేకుండా నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ నాగేశ్వర్ రావు తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించేందుకు జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో కామారెడ్డి సబ్ డివిజన్ పోలీసులు సోమవారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చాలామంది వాహనాలకు నెంబర్ ప్లేట్‌లు సక్రమంగా ఉండటం లేదన్నారు. వారిలో కొందరు చలాన్‌లను తప్పించుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే సక్రమంగా ఉంచుకోవడం లేదన్నారు. దీని కారణంగా దొంగలు, చైన్ స్నాచర్‌లను గుర్తించే క్రమంలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 68 బైక్‌లను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ సీఐ రామన్, డివిజన్ పరిధి లోని పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో పోచారం భాస్కర్‌రెడ్డి



బాన్సువాడ రూరల్ : ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి సోమ వారం మర్యాదపూర్వకంగా కలిశారు.

సమయానికి రాని టీచర్!



పెద్దకొడప్‌గల్: మండలంలోని విఠల్‌వాడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఐదో తరగతి వరకు 38 మంది విద్యార్థులు చదువుండగా ఒకరే టీచర్ ఉన్నారు. పాఠశాల భవనానికి మరమ్మతులు చేస్తుండటంతో పంచాయతీ కార్యాలయంలో పాఠాలు చెబుతున్నారు. అయితే సోమవారం ఉదయం 10:45 గంటల వరకు కూడా ఉపాధ్యాయురాలు రాకపోవడంతో విద్యార్థులు బయటే నిరీక్షించారు.

సౌదీలో మాచారెడ్డి వాసి మృతి



మాచారెడ్డి: మాచారెడ్డికి చెందిన సుతారి ప్రభాకర్ (45) ఆదివారం రాత్రి సౌదీలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇక్కడ ఉపాధి కరువై అప్పుజేసి పది రోజుల కిందట సౌది వెళ్లిన ప్రభాకర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మ గుట్టలో పోలీస్‌లైన్ మార్గంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల వరకు ఉంటుందని ఎస్సై సంజీవ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 87126 59840, 87126 59719 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని 8 మేకలు మృతి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్ తండా వద్ద సిమెంట్ లారీ ఢీకొని ఎనిమిది మేకలు మృతి చెందాయి. బాన్సువాడ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న లారీ గాంధీనగర్ తండా వద్ద రోడ్డు దాటుతున్న మేకల మందను ఢీకొంది. తండాకు చెందిన లక్ష్మణ్ మేకలు చనిపోయాయి.

బోరు మోటార్ల చోరీ

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి రైతులకు చెందిన బోరు మోటార్లు, కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆదివారం దొంగలు అలీసాగర్ ఎత్తిపోతల కాల్వలో వేసిన మోటార్లు, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ డైరెక్టర్ అబ్దుల్ మౌలానా తెలిపారు. నవీపేట్ మండలం కోస్లీ శివారులో తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన 8 మంది రైతుల మోటార్లు, కేబుల్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. నవీపేట్, రెంజల్ ఎస్సైలు సోమవారం సాయంత్రం ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఇసుక నిల్వలు సీజ్

రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచరం మేరకు సోమవారం పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. కందకుర్తి గోదావరి నుంచి అక్రమంగా రవాణా చేసి పంటపొలాల్లో నిల్వ చేసిన సుమారు 1000 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

బోధన్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. సోమవారం బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి: మండలంలోని జానకంపేట శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సోమవారం తెల్లవారుజామున ఎస్సై వంశీకృష్ణరెడ్డి పట్టుకున్నారు. వివరాలు.. బోధన్ మండలం కొప్పర్గ మంజీర నుంచి అక్రమంగా ఇసుకను మూడు టిప్పర్లలో ఎడపల్లి మండలం మీదుగా నిజామాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై దాడి చేసి టిప్పర్లను పట్టుకున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి శివారు ఎడ్లకట్టవాగు సమీపంలో సోమవారం ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. గ్రామం నుంచి మండల కేంద్రానికి వస్తున్న లారీ మలుపు వద్ద రోడ్డు కిందకు వెళ్లి పడిపోగా అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ

నందిపేట్: నందిపేటలో రవాణా శాఖ అధికారులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నాలుగు ప్రైవేట్ స్కూల్ బస్సులను, రెండు గూడ్స్ వాహనాలు, ఒక ట్రాలీ ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మండల కేంద్రానికి చెందిన నాలుగు ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ లేదని, అనుభవం లేని డ్రైవర్లతో నడుపుతుండటంతో సీజ్ చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి తెలిపారు. ఆర్టీఏ సిబ్బంది మనోజ్, దశరథ్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య



రాములు(ఫైల్)

నాగిరెడ్డిపేట: ఆర్థిక ఇబ్బందులతో నాగిరెడ్డిపేట మండలం మాసాన్‌పల్లి గ్రామపంచాయతీలో వాటర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న నాయికోటి రాములు(58) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజు కథనం ప్రకారం.. రాములు వాటర్‌మన్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న ఆయన ఆదివారం ఇంటివద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం కామారెడ్డికి, అక్కడి నుంచి సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు రాములు ఆరోగ్య పరిస్థితిపై నమ్మకం లేదని తెలపడంతో ఇంటికి తీసుకొస్తుండగా మాసాన్‌పల్లి శివారులోకి ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తుమ్కిపల్లిలో యువకుడు..



జ్ఞానేశ్వర్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం తుమ్కిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి జ్ఞానేశ్వర్(25) సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కుమ్మరి శివరాణి, విఠల్ దంపతుల కుమారుడు జ్ఞానేశ్వర్‌కు మార్చి 29న మెదక్ జిల్లా పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం అయింది. సోమవారం తల్లిదండ్రులు వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లారు. భార్య ఇంట్లో ఉండగానే దూలానికి ఉరి వేసుకొని జ్ఞానేశ్వర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆయన మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు.

ఉప్పలవాయి శివారులో..



మహేశ్ (ఫైల్)

రామారెడ్డి: రామారెడ్డి గ్రామానికి చెందిన అమ్ముల మహేశ్(27) సోమవారం రాత్రి ఉప్పల్‌వాయి శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. నిజామాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెంచిర్యాల్‌లో..



నరేశ్ (ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామానికి చెందిన ఏలేటి నరేశ్(44) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై భాస్కరాచారీ తెలిపిన వివరాలు.. నరేశ్ కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి అదుపులోకి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పొలంలో కౌలు రైతు మృతి



బాలాజీ మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ శివారులోని వ్యవసాయ పొలంలో కౌలు రైతు దండాల్‌వార్ బాలాజీ(37)అనే వ్యక్తి మృతి చెందాడు. జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలబత్‌పూర్ గ్రామానికి చెందిన బాలాజీ ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అర్గుల్ శివారులోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిని బాలాజీ కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కాగా ఈ నెల 23న మధ్యాహ్నం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన బాలాజీ ఇంటికి తిరిగి రాలేదు. బాలాజీ తమ్ముడు ప్రకాశ్ వ్యవసాయ పొలం వద్ద వెతకగా అదే రోజు రాత్రి ఎనిమిది గంటల సమయంలో పొలంలో బాలాజీ మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరి మృతి

బోధన్‌టౌన్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన బోధన్ నుంచి పెంట ఖుర్దు రోడ్డులో గల చిక్కి క్యాంప్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. బోధన్‌లోని ఏకచక్రనగర్‌కు చెందిన రావుల రాములు(65) పింఛన్ డబ్బులు తీసుకు రావడానికి భార్య మారమ్మ, కుమారుడు షాదుల్లాతో కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కోటగిరి వెళ్తున్నాడు. చెక్కి క్యాంపు చెందిన గైని రాజన్న వీరి వాహనాన్ని చెక్కి క్యాంపు సమీపంలో ఎదురుగా ఢీకొన్నాడు. ప్రమాదంలో రాములుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు భార్య, కుమారుడికి, గైని రాజన్నకు గాయాలయ్యాయి. గైని రాజన్న అజాగ్రత్తగా, అతివేగంగా బైక్ నడపడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సీఐ వీరయ్య తెలిపారు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కారును ఢీకొన్న లారీ



ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బా ప్రాంతంలో కారును లారీ ఢీకొన్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. బాధిత రైతు బొంబొతుల సుదర్శన్‌గౌడ్ తెలిపిన వివరాలు.. రోజూ మాదిరిగా మేతకు వెళ్లిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్‌కు తగిలి మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు హ్యాండిల్ లేకపోవడంతో గతంలో రెండు మేకలు, ఒక గేదె మృతి చెందిందదని ట్రాన్స్‌కో ఏఈకి చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

పర్మళ్లతండాలో ఎద్దు..

లింగంపేట: మండలంలోని పర్మళ్ల తండా శివారులోని పంట చేనుల్లో సోమవారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందినట్లు తండా వాసులు తెలిపారు. పర్మళ్ల తండాకు చెందిన కాట్రోత్ ఫతి ఎద్దు ఉదయం మేతకు వెళ్లగా.. పంట చేనులో ఎల్‌టి లైను కండక్టర్ వైర్లు తెగిపడి ఉన్నాయి. ఎద్దుకు వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌కో అధికారులకు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎద్దు విలువ రూ. 40వేలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

డిచ్‌పల్లి: మండలంలోని ఇస్లాంపుర ప్రాంతానికి చెందిన మహమ్మద్ మక్బూల్ అహ్మద్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆయన కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లగా మక్బూల్ రాత్రి రెండు గంటల ప్రాంతంలో పాల వ్యాపారం కోసం ఇంటికి తాళం వేసి బయటకు వచ్చాడు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని రూ.60 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.